
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 4 । అక్టోబర్ । 2024



దసరా సంబరం..
ఘనంగా ప్రారంభం


డోలు వాయిస్తున్న యువతి

పసిడిపురి మెరిసింది. దేవీ వైభవాన్ని తరించి మురిసింది. కళాకారుల ప్రదర్శనలకు ముచ్చటపడింది. ప్రొద్దుటూరు పట్టణంలో దసరా ప్రారంభోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో.. విద్యుద్దీప అలంకారాలతో ఆలయాలు శోభిల్లాయి. తొలిరోజు 'అమ్మవారు' రాజరాజేశ్వరిగా భక్తులను కరుణించారు.

- శోభిల్లిన అమ్మవారి ఆలయాలు
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

ప్రొద్దుటూరు కల్చరల్: దసరా ఉత్సవాల నిర్వహణలో రెండో మైసూరుగా ఖ్యాతి గడించిన పుత్తడిపురం ప్రొద్దుటూరులో దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల దసరా ఉత్సవ కమిటీల వారు దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు అగస్త్యేశ్వర స్వామి ఆలయం నుంచి కలశాలలో నింపిన నవగంగ తీర్థాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో, బాణసంచా పేలుళ్లతో ఊరేగింపుగా బయల్దేరి తెల్లాకుల శివయ్యగారి నగరేశ్వరస్వామి దేవస్థానం నుంచి చినవీరయ్య శెట్టి రచించిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి పురాణాన్ని తీసుకురావడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పూణేకు చెందిన 70 మంది కళాకారుల సంస్కృతి వాయిద్య పథక్ సుయోగ్ బ్రాస్ బ్యాండ్, హర్యాణాకు చెందిన భంభంభోలే శివుడు, సాధువుల వేషధారణలో భస్మం చల్లుకుంటూ కళాకారుల ప్రదర్శన, బాణసంచా పేలుళ్లు, పాలకొల్లు బ్యాండ్, కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్ రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, ఆర్యవైశ్య సభ సెక్యూరిటీ సోషల్ వెల్ఫేర్ కన్వీనర్ సీవీ సురేష్ పాల్గొన్నారు. అలాగే కడప విజయదుర్గా ఆలయంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వేడుకలు వైభవంగా మొదలయ్యాయి.


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి పురాణాన్ని తీసుకువస్తున్న ఆర్యవైశ్యులు


హర్యాణా కళాకారుల భంభం భోలే ప్రదర్శన

న్యూస్‌రీల్

నేటి నుంచి శిక్షణ

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని గ్రామ పంచాయతీ ఉప సర్పంచులు, ఒక్కో గ్రామ పంచాయతీకి ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కడప జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో శిక్షణ ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన విధానం, పంచాయతీరాజ్ చట్టం, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, ఆర్థిక నిర్వహణ, లేఅవుట్, బిల్డింగ్ ప్లాన్, ఆస్తులు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓలు, ఈఓ పీఆర్ అండ్ ఆర్డీలు, డీఎల్‌పీఓలు శిక్షణకు హాజరు కావాలని కోరారు.

బాబు తీరుతో విద్యార్థులకు నష్టం: ఎంపీ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను నడిపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విమర్శించారు. గురువారం కడపలో జరిగిన బార్మీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎంసీ పులివెందుల మెడికల్ కాలేజీకి 50 సీట్లు కేటాయించిందని, ప్రభుత్వం కోరి ఉంటే 150 సీట్లు ఇచ్చి ఉండేదన్నారు. ఆ లెక్కన రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 5 మెడికల్ కళాశాలలకు 750 మెడికల్ సీట్లు వచ్చి ఉండేవని, ఇక్కడి విద్యార్థులకు ఎంతో ప్రయోజకరంగా ఉండేదన్నారు. అన్యాయంగా ఆ సీట్లను కోల్పోయామన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులకు ఇంతటి తీరని ద్రోహం చేసిన కూటమి ప్రభుత్వం ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు.

కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు


మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎన్నికల కమిషన్‌కు పంపుతున్నామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే 1941 పోలింగ్ కేంద్రాలు ఉండగా, కొత్తగా 22 పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కడప నియోజకవర్గంలో 19, ప్రొద్దుటూరు 1, కమలాపురంలో 2 పోలింగ్ కేంద్రాలు గుర్తించామన్నారు. ఓటర్ల సర్వే ప్రక్రియ జిల్లాలో 99.45 శాతం పూర్తయిందన్నారు.

ఐక్యంగా ఉద్యమిద్దాం

- ఎంఎస్ఎంఈ టీసీని కొప్పర్తిలో కొనసాగించాల్సిందే
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల డిమాండ్
- జీవో నంబర్ 56ను ఉపసంహరించుకోవాలి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతిపత్రమిస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా అభివృద్ధిని కాలరాస్తోందని నేతలు మండిపడ్డారు. ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ తరలింపుపై జీవో జారీ చేయడం సరికాదని ధ్వజమెత్తారు. జిల్లాలో అభివృద్ధి జరగాలంటే ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గురువారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో అఖిలపక్ష పార్టీ నేతలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్ బూసిపాటి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ఉండాలని నాడు ఎమ్మెల్యేలమంతా ఒత్తిడి తేవడం వల్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.250కోట్లతో కొప్పర్తిలో దీనిని ఏర్పాటు చేయాలని కేంద్రానికి సూచించారన్నారు. ఈ సెంటర్ ఇక్కడుంటే చదువుకున్నవారికి వివిధ రంగాలలో నైపుణ్యం, ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఇలాంటి సెంటర్‌ను సీఆర్‌డీఏకు తరలించడం దారుణమన్నారు. చంద్రబాబు తన పాలనలో 16వేల పరిశ్రమలను మూయించారని, ప్రభుత్వ ఆసుపత్రులను కూడా ప్రైవేటుపరం చేయబోతున్నారన్నారు. గత ప్రభుత్వంలోనే బద్వేల్ సెంచురీప్లై పరిశ్రమ వచ్చిందని గుర్తు చేశారు. వైజాగ్–చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో కొప్పర్తి చేరడానికి కారణం కూడా గత ప్రభుత్వమేనని తెలిపారు.



- కాంగ్రెస్ నేత ఎస్ఏ సత్తార్ మాట్లాడుతూ టెక్నాలజీ సెంటర్‌ను సీఆర్‌డీఏకు తరలించడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రాణవాయువులాంటి ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని ప్రారంభించాలన్నారు. 15 ఏళ్ల ప్రత్యేక హోదా ఇస్తామన్న బీజేపీ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు.
- భూపోరాట కమిటీ జిల్లా అధ్యక్షులు బి. నారాయణ ,బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు ఎస్. యానాదయ్య మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్, నిత్యానందరెడ్డి, సీహెచ్ వినోద్, తోటక్రిష్ణ, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, సీఐటీయూ నాయకులు మనోహర్, సీపీఎం నాయకులు శ్రీనివాసుల రెడ్డి, రామ్మోహన్,అన్వేష్, బీఎస్పీ నాయ కులు గుర్రప్ప, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, దత్తసాయి పాల్గొన్నారు.

జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తాలి: మాజీ డిప్యూటీ సీఎం



జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై ప్రతి ఒక్కరూ గళమెత్తాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా పిలుపునిచ్చారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయించి, అందులో 5 మెడికల్ కాలేజీలను ప్రారంభానికి అనువుగా తయారు చేశారన్నారు. ఈ మేరకు కేంద్రం పులివెందుల, పాడేరు కాలేజీలకు 50 సీట్లు మంజూరు చేస్తే వద్దని లేఖ రాసిన ఈ ప్రభుత్వాన్ని ఏమనాలని ప్రశ్నించారు. హాస్టల్ లేకపోవడం వల్లే మెడికల్ కాలేజీని ప్రారంభించలేని వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జెండాలను, ఎజెండాలను పక్కన పెట్టి పోరాటం చేయాలని కోరారు.

టెక్నాలజీ సెంటర్‌ను కొనసాగించకపోతే ఉద్యమమే: జి. చంద్ర



కొప్పర్తిలో టెక్నాలజీ సెంటర్‌ను కొనసాగించకపోతే ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి జి. చంద్ర స్పష్టం చేశారు. జిల్లాలో విస్తారమైన ఖనిజ సంపద ఉందని, కృష్ణా, తుంగభద్ర జలాలు, కృష్ణపట్నం ఓడరేవు అందుబాటులో ఉన్నాయన్నారు. దివంగత వైఎస్సార్ రాయలసీమ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేశారని, ఆయన మరణానంతరం అనేక ప్రాజెక్టులు మూలనపడ్డాయన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కూడా పోరాటం చేయాలన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగం: సీపీఎం నేత చంద్రశేఖర్



ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను సీఆర్‌డీఏకు తరలించడం ద్వారా కూటమి ప్రభుత్వం రాయలసీమ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు, పారిశ్రామిక వేత్తల అభివృద్ధి అడ్డుకుందని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. ఈ సెంటర్‌లో రాయలసీమలోని విద్యావంతులైన యువతకు శిక్షణ ఇచ్చి, 17 రకాల నైపుణ్యాలు ఇందులో నేర్పిస్తారన్నారు. ఇది యువతీ, యువకుల స్వయం సమృద్ధికి, చిన్న మధ్యతరహా పరిశ్రమల నిర్మాణానికి దోహదం చేస్తుందన్నారు. ఈ సెంటర్‌ను తరలించడం కూటమి ప్రభుత్వం చేసిన సరిదిద్దుకోలేని తప్పు అన్నారు.

వైఎస్సార్ జిల్లాపై చంద్రబాబు కక్ష సాధింపు

వైఎస్సార్ జిల్లాపై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధిస్తున్నారని అఖిలపక్ష కమిటీ నాయకులు ఆరోపించారు. గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలిచంద్ర, జి. చంద్రశేఖర్, ఏఐసీసీ కో ఆర్డినేటర్ ఎస్ఏ సత్తార్, దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిశోర్ బూసిపాటి, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి ఎస్. గుర్రప్ప, సీఐటీయూ నాయకులు మనోహర్ తదితరులు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు వినతి పత్రమిచ్చారు. టెక్నాలజీ పార్కు వల్ల యువతకు స్కిల్స్, ట్రైనింగ్, ప్రపంచ స్థాయి ఇంజినీరింగ్ నైపుణ్యాలు కల్పించి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చన్నారు. జిల్లాలోని యువత అవకాశాలను దెబ్బతీస్తూ ఈ ప్రభుత్వం జీవో జారీ చేయడం దారుణమన్నారు. కేంద్రం కేటాయించిన టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తి సెజ్‌లోనే ఉంచాలని కోరారు.

జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక

కలెక్టర్ శివశంకర్


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: విజన్–2047 ఆశయ సాధనలో భాగంగా జిల్లా ఆర్థికాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు ప్రజలు విలువైన సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రజాప్రతినిధులు, ఎన్జీఓలు, రైతులను కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఈ అంశంపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాను అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు మండల స్థాయిలో విజన్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఈ విషయంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించి వారి అభిప్రాయాలు స్వీకరించేందుకు వీలుగా క్యూఆర్ కోడ్ తీసుకు వచ్చామన్నారు. ప్రతి రంగంలో 15 శాతం గ్రోత్ రేటింగ్ నిర్దేశించుకోవాలన్నారు. సోలార్, విండ్ వంటి రెన్యూవల్ ఎనర్జీలపై దృష్టి సారించాలన్నారు. ఉద్యాన పంటలకు రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నందువల్ల ఆ దిశగా ప్రణాళికలు ఉండాలన్నారు. వీటితోపాటు ఖనిజ సంపద, టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే మాధవీరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి, చేతి వృత్తుల జాతీయ ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, హ్యూమన్‌రైట్స్ యాక్టివిస్ట్ జేవీ రమణ, సీపీఓ వెంకట్రావు, ఆర్డీఓ వెంకటపతి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'కడప నుంచి అరకు' విజ్ఞాన విహార యాత్ర

ఏపీ దర్శన్‌లో భాగంగా 'కడప నుంచి అరకు' పేరుతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజ్ఞాన విహార యాత్ర శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సముద్రం, జంతు ప్రదర్శనశాలలు చూసిన వారు పది శాతం మాత్రమే ఉన్నారన్నారు. అందుకే జిల్లాలోని కేజీబీవీ, ప్రభుత్వ, జెడ్పీ పాఠశాలలు, సాంఘిక సంక్షేమం, బీసీ సంక్షేమం, గిరిజన, గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి 500 మందిని ఎంపిక చేశామన్నారు. పీపీపీ పద్ధతిలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కడప నుంచి శుక్రవారం సాయంత్రం 3 గంటలకు కడప ఆర్ట్స్ కళాశాలనుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన 'టెట్'

జిల్లావ్యాప్తంగా తొలి రోజు 148 మంది గైర్హాజరు


కేఎస్ఆర్ఎం పరక్షా కేంద్రం వద్ద నెంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబులిటి టెస్టు (ఏపీ టెట్)–2024 గురువారం ప్రశాంతంగా ప్రారంభమయింది. జిల్లావ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరులలో మొత్తం 8 పరీక్షా కేంద్రాలలో ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించే ఈ టెట్ పరీక్ష నిర్వహణ కోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా తొలి రోజు నిర్వహించిన పరీక్షకు అభ్యర్థులంతా నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షకు హాజరైన అభ్యర్థుల హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును పరిశీలించన అనంతరం అధికారులు అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. తొలి రోజు ఉదయం, సాయంత్రం రెండు షెషన్లకు సంబంధించి 1490 మంది అభ్యర్థులకుగాను 1342 మంది అభ్యర్థులు హాజరుకాగా 148 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. పరీక్షను రాష్ట్ర కేజీబీవీ సెక్రటరీ,జిల్లా అబ్జర్వర్ మధుసూదన్‌రావు ఆరు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా, డీఈఓ రెండు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

జిల్లాలో వర్షం

- మూడు రోజుల నుంచి ఒకటే ఉక్కపోత
- వర్షం రాకతో కాసింత ఉపశమనం

కడప అగ్రికల్చర్: మూడు రోజుల నుంచి ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న జనాలకు ఊరట లభించింది. బుధవారం రాత్రి, గురువారం సాయంత్రం జిల్లాలోని పలు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం కాసింత చల్లబడింది. పైగా మరో రెండు రోజులపాటు జిల్లాలో వర్షాలు కురి సే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది.

వేములలో అత్యధికంగా...

జిల్లాలో వేములలో అత్యధికంగా 50.4 మి.మీ వర్షం కురిసింది. దీంతోపాటు తొండూరులో 35.6, పులివెందుల్లో 26, కలసపాడులో 25.4, ఒంటిమిట్టలో 16.8 , వీఎన్‌పల్లిలో 10.2 , సిద్దవటంలో 8.2 ,సికెదిన్నెలో 6.2, ఎర్రగుంట్లలో 4.6, కాశినాయనలో 4.2, చక్రాయపేటలో 3.6 , పోరుమామిళ్లలో 3.2 , వల్లూరులో 2.8, సింహాద్రిపురంలో 1.8, ముద్దనూరులో 1.2, ప్రొద్దుటూరులో 1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షం రబీలో ఆరుతడి పంటలకు అనుకూలమని రైతులు తెలిపారు.

పిడుగుపాటుతో ముగ్గురు మృతి

మరొకరికి గాయాలు


మృతిచెందిన శివపార్వతి


తేజేశ్వర్‌రెడ్డి


మారుతిప్రసాద్‌రెడ్డి

పెండ్లిమర్రి: పెండ్లిమర్రి మండలం తుమ్మలూరు గ్రామ సమీపంలోని పొలాల్లో గురువారం సాయంత్రం గాలి, వానతో పాటు వేరు వేరు చోట్లు పిడుగులు పడ్డాయి. దీంతో పిడుగు పాటుకు గురైన తుమ్మలూరుకు చెందిన నందిరెడ్డి శివపార్వతి(30), నందిరెడ్డి తేజేశ్వర్ రెడ్డి(12), పగడాలపల్లె గ్రామానికి చెందిన జి.మారుతి ప్రసాద్‌రెడ్డి(25) మృతి చెందారు. నాగాయపల్లెకు చెందిన నరేష్‌కుమార్‌రెడ్డికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు..శివపార్వతి, తేజేశ్వర్‌రెడ్డిలు గ్రామ సమీపంలోని పొలాల్లోకి పశువులను మేపుకోవడానికి వెళ్లారు. గాలి, వాన రావడంతో సమీపంలోని చెట్టు వద్దకు వచ్చారు.ఆ ఇద్దరిపై పిడుగు పడి అక్కడిక్కడే మృతి చెందారు. తేజేశ్వర్‌రెడ్డి వెల్లటూరులోని సత్య సాయి హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. ఇక పగడాలపల్లె గ్రామానికి చెందిన మారుతిప్రసాద్ రెడ్డి, నరేష్‌కుమార్‌రెడ్డి మరికొందరు కలిసి తుమ్మలూరు గ్రామ సమీపంలోని పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలించడగానికి కూలీ పనులకు వెళ్లారు. ట్రాక్టర్‌కు ఇసుక నింపి ట్రాక్టర్‌ను పంపించి మరల టిప్పు తోలడానికి అక్కడే ఉండగా, వర్షంతో పాటు పిడుగు పడి మారుతి ప్రసాద్‌రెడ్డి అక్కడిక్కడే మృతి చెందాడు. నరేష్‌కుమార్‌రెడ్డి స్పృహ కోల్పోవడంతో ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దెబ్బతిన్న ఇంటి ఎలివేషన్

వేంపల్లె: వేంపల్లె పట్టణంలోని శ్లోకా స్కూలు సమీపంలో ఉన్న ప్రొద్దుటూరు రెడ్డి రాజా ఇంటిపై పిడుగు పడి ఇంటి ఎలివేషన్ దెబ్బతింది. ఎవరికి ప్రమాదం జరగలేదు.



క్లుప్తంగా

బాలికపై అత్యాచారం

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఎనిమిదేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసు వివరాల మేరకు తాలూకా పరిధికి చెందిన రవిశంకర్ అనే యువకుడు చిన్న చౌక్ పరిధిలో ఉన్న మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. పది రోజుల క్రితం ఆమె ప్రసవించింది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

పెద్దముడియం : మండలంలోని జంగాలపల్లె గ్రామంలో విజయ(50)అనే వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రామయ్య, విజయ దంపతులకు ఒక కూతరు ఉంది. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. డిగ్రీ చదువుతున్న కూతురికి పెళ్లి చేయాలని చెప్పిన మాటలను విజయ భర్త రామయ్య పట్టించుకోలేదు. ఇదే విషయంపై దంపతులిద్దరూ గొడవపడ్డారు. దీంతో మనస్థాపం చెందిన విజయ బుధవారం రాత్రి ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఆటల పోటీలు



యూటీఎఫ్ నాయకులతో కలిసి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి మండిపల్లి

కడప ఎడ్యుకేషన్ : యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన ఉపాధ్యాయులకు అక్టోబర్ 4, 5, 6 తేదీలలో మూడు రోజులపాటు గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. ఈ ఆటలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను గురువారం రాష్ట్ర క్రీడలు, యువజన, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చిన్నమండెంలోని తమ స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, కడప జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ పాల్గొన్నారు.

సబ్సిడీలో కోత.. రైతులకు వేత

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 40 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు పంపిణీ
- ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 25 శాతం మాత్రమే సబ్సిడీ
- బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ శనగలు రూ. 7400
- టెండర్‌దారుడి నుంచి ప్రభుత్వం క్వింటాల్ రూ.9400 చొప్పున కొనుగోలు
- ఇదెక్కడి చోద్యం అంటున్న అన్నదాతలు



రైతులకు అందించనున్న శనగలు

కడప అగ్రికల్చర్ : ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్న రైతన్నలు పంట చేతికొచ్చే సమయానికి ప్రకృతి వైపరీత్యాలతో నష్టాలను చవిచూడక తప్పడం లేదు. ఇలాంటి తరుణంలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు వారిని చిన్న చూపు చూస్తున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అదే బాటలో నడుస్తూ సబ్సిడీ రూపంలో రైతులపై భారం మోపుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రబీ రైతులకు 40 శాతం సబ్సిడీతో శనగలను అందిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదే రబీలో శనగ రైతులకు 25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలను అందించాలని ఖరారు చేసింది. అంటే గతేడాదికంటే 15 శాతం తగ్గించి రైతులపై భారం మోపుతోంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాధారం కింద..

రబీ సీజన్‌లో వర్షాధారం కింద జిల్లాలో 30 మండలాలకు పైగా గ్రామాల్లో రైతన్నలు శనగపంటను సాగు చేస్తారు. ఈ రబీలోనే కేవలం శనగపంట 82261 హెక్టార్లలో సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ అంచాలను సిద్ధం చేసింది. ఈ మేరకు 72,366 క్వింటాళ్ల శనగ విత్తనాలను కూడా జిల్లాకు కేటాయించారు. దీంతోపాటు శనగపంటను సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా విత్తనాలను పంపిణీ చేయనుంది. ఇందులో 50 సెంట్లు భూమి ఉన్న రైతుకు ఒక బస్తా(20 కిలోలు) చొప్పున 5 ఎకరాల వరకు 10 బస్తాలను సబ్సిడీలో రైతులకు అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ విత్తనాల ధరను కూడా ప్రకటించింది. సాధారణంగా కిలో పూర్తి ధర రూ. 94 గా ఖరారు చేసింది. ఇందులో ప్రభుత్వం 25 శాతం సబ్సిడీతో కిలోపైన రూ. 23.50 రాయితీ ఇస్తోంది. ఈ సబ్సిడీ పోను రైతులు తమ వాటా 75 శాతంతో కిలోకు రూ. 70.50 చెల్లించాలని ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో అయిదు ఎకరాల భూమి ఉంటే గరిష్ఠంగా 10 బస్తాలు (మూట 20 కిలోలు) ఇవ్వనున్నారు.

గత ప్రభుత్వంలోనే మేలు..

శనగ విత్తనాల పంపిణీకి సంబంధించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శనగ విత్తనాలను రైతులకు 40 శాతం సబ్సిడీతో అందించింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం సబ్సిడీని 25 శాతానికి కుదించింది. అంటే గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం 15 శాతం సబ్సిడీలో కోత విధించింది. దీంతో అన్నదాతలు కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు. అసలే ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేక సాగు చేసిన పంటలు సరిగా పండక చాలా మంది రైతులకు సాగు పెట్టుబడులు కూడా రాక నష్టపోవాల్సి వచ్చింది. ఈ రబీలోనైనా శనగపంటను సాగు చేసి పది రూపాయలు కళ్ల చూద్దామనుకుంటే కూటమి ప్రభుత్వమేమో సబ్సిడీలోనూ కోత విధించి రైతులపై భారాన్ని మోపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన విత్తనాలనే ...

రైతులు గతేడాది పండించిన నాణ్యమైన శనగలు బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ రూ. 7200 నుంచి రూ. 7400 వరకు రైతులు అమ్ముతుంటే రాష్ట్ర ప్రభుత్వం టెండర్‌దారుల నుంచి క్వింటాల్‌ను రూ.9400కు కొనుగోలు చేసినట్లు తెలిసింది. అంటే టెండర్‌దారుడు వాటిని గ్రేడింగ్ చేసి ప్రభుత్వానికి అందిస్తారని అందు కోసం అదనపు డబ్బులు పెట్టి కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ టెండర్‌దారులు అన్ని శనగలను రైతుల వద్ద కాకుండా అక్కడక్కడా రెండేళ్ల నుంచి గోడౌన్‌లలో వ్యాపారుల వద్ద స్టాక్ ఉన్న విత్తనాలను కొనుగోలు చేసి ఇప్పుడు కొన్న విత్తనాలలో కలుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

టెండర్‌దారునికి మేలు చేసేందుకే..



బహిరంగ మార్కెట్‌లో తక్కువ రేటుకు శనగలు దొరుకుతున్నాయి. ఈ తరుణంలో ప్రభుత్వం అధిక రేటు పెట్టి టెండర్ దారుని వద్ద నుంచి శనగలు కొనాల్సిన అవసరం ఏముంది. అంటే టెండర్ దారునికి, కమీషన్‌దారులకు మేలు చేయడం తప్ప రైతులకు కాదు.

– దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి(సీపీఎం రైతు విభాగం)

సబ్సిడీ తగ్గించడం దుర్మార్గం



గత ప్రభుత్వంలో శనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీతో రైతులకు అందజేయగా ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం 25 శాతానికి సబ్సిడీని తగ్గించడం దుర్మార్గం. దీన్ని బట్టి చంద్రబాబుకు వ్యవసాయంపై ఏమాత్రం ప్రేమ ఉందో అర్థమవుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించాలి.

– పోతిరెడి భాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి(సీపీఐ రైతు విభాగం)

రైతులంటే చిన్న చూపు



కూటమి ప్రభుత్వానికి రైతులంటే చిన్నచూపు గత ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇచ్చింది. ఈ ప్రభుత్వమేమో 15 శాతం సబ్సిడీ తగ్గించి 25 శాతం చేసింది. ఇది చాలా అన్యాయం.

– వేమిరెడ్డి ఓబుల్‌రెడ్డి, రైతు, కృష్ణంపల్లి, దువ్వూరు మండలం.

సబ్సిడీ పెంచాలి



కూటమి ప్రభుత్వం శనగ విత్తనాలకు సంబంధించిన సబ్సిడీని పెంచాలి. ఎందుకంటే ఖరీఫ్‌లో సరైన వర్షాలు లేక చాలా మంది రైతులకు సంబంధించిన పంటలు కూడా ఎండిపోయి నష్టపోయారు. ఇలాంటి తరుణంలో సబ్సిడీ పెంచి విత్తనాలను ఇస్తే రైతులను ఆదుకున్నవారు అవుతారు. కానీ ఉన్న సబ్సిడీని తగ్గించడం అనేది అన్యాయం.

– దొంతిరెడ్డి రంగారెడ్డి, రైతు కొట్టాలగ్రామం, రాజుపాలెం మండలం.

'మేము టీడీపీ కౌన్సిలర్ మనుషులం'



ప్రొద్దుటూరు : మేము టీడీపీ కౌన్సిలర్ మనుషులమంటూ స్థానిక వైఎంఆర్ కాలనీలోని పార్కు వద్ద కొందరు వ్యక్తులు గొడవకు దిగారు. ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను ఇటీవల ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తొలగింపజేశారు. దీంతో కాలువపైన ఉన్న దుకాణాలు తొలగిపోయాయి. కాగా గురువారం ఉదయం ఓ మహిళతోపాటు మరికొంత మంది అక్కడికి వచ్చి తాము మూడో వార్డు టీడీపీ కౌన్సిలర్ ద్వారా వచ్చామని, ఆయన చెప్పడంతోనే ఇక్కడ దుకాణం పెట్టుకుంటున్నామన్నారు. అక్కడున్న మరికొందరు మాట్లాడుతూ గతంలోనే ఇక్కడ కూల్ డ్రింక్ షాపు ఉందని ఒక వ్యక్తి, చికెన్ షాపు ఉందని మరో వ్యక్తి వాగ్వాదానికి దిగారు. ముగ్గురు పరస్పరం వాగ్వాదం చేసుకుంటుండగా ఇదేమిటని చూసినవారు విస్తుపోయారు. అవేమీ పట్టించుకోకుండా కౌన్సిలర్ మనుషులు షాపులు ఏర్పాటు చేసుకున్నారు.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప అగ్రికల్చర్ : గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో సార్వత్రిక దూర విద్యా కేంద్రం ద్వారా వ్యవసాయ విద్యకు సంబంధించి సర్టిఫికెట్ కోర్సులు చేసేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. అక్టోబర్ నుంచి ప్రారంభం కానున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులైన చిరుధాన్యాలు, సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్టు తయారీ, తేనెటీగల పెంపకానికి సంబంధించి 8 వారాల వ్యవధిలో శిక్షణ నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు ఒక్కో కోర్సుకు రూ. 1500 చొప్పున ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ సదుపాయం (కంప్యూటర్ లేదా ఆండ్రాయిడ్ సెల్ ఫోన్, ఐపాడ్) కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తిగల వారు తమ పేర్లను అక్టోబర్ 15వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు వ్యవసాయ విశ్వ విద్యాలయం వెబ్‌సైట్ www.a nfrau.ac.in ను సందర్శించి తెలుసుకోవచ్చన్నారు. లేదా 8008788776, 8309626619, 8096085560 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

నేటి నుంచి అండర్–14 మల్టీడేస్ క్రికెట్ టోర్నీ

– తలపడనున్న 7 జిల్లాల జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాలు వేదికగా ఈనెల 4 నుంచి 23వ తేదీ వరకు ఏసీఏ అండర్–14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. కడప, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) ప్రతినిధులు తెలిపారు.

జిల్లా జట్టు ప్రకటన..

ఏసీఏ అండర్–14 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా అండర్–14 బాలుర జట్టును సీఏవైడీ కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్ ప్రకటించారు. ఇటీవల ఎంపికలు నిర్వహించి, ప్రాక్టీస్ మ్యాచ్‌ల నిర్వహణ అనంతరం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

అండర్–14 జిల్లా జట్టు : పి. హితేష్ (కెప్టెన్), సి.వి.ఎస్. ప్రశాంత్, జి.సూర్యతేజ్‌రెడ్డి, ఎ. అభినివేష్‌రెడ్డి, ఎం.జగదీశ్వర్‌రెడ్డి, కె. లోకేష్, ఎస్ఎండీ తాహీర్, జె.పి.ఖలీద్, ఆర్. యోగాంజనేయులు, ఎస్ఎండీ ఫైజాన్, ఆర్.పి. ఇమ్మాను యేల్, బి.సాయికృష్ణచైతన్య, పి.అస్లద్అలీఖాన్, బి.మునిజ్ఞానేశ్వర్‌రెడ్డి, జి. ఆదిత్య, జి.మానసనందన్, పి.అష్మన్‌ఖాన్, ఎ.చెన్నకేశవ. స్టాండ్‌బై: వి.రామ్‌చరణ్, యు. శివచరణ్, ఎస్.భానువర్షిత్‌రెడ్డి, ఎస్ఎండీ ఉమైర్‌సిద్దిక్, జి. భవిత్ రెడ్డి, ఎం.వర్షిత్‌కుమార్, వి.శేరనయరెడ్డి.

తేదీ	తలపడే జట్లు	వేదిక
4 నుంచి 5 వరకు	చిత్తూరు–కర్నూలు	వైఎస్ఆర్ఆర్
4 నుంచి 5 వరకు	విశాఖపట్నం– ప్రకాశం	కేఎస్ఆర్ఎం
4 నుంచి 5 వరకు	కడప–పశ్చిమగోదావరి	కేఓఆర్ఎం
7 నుంచి 8 వరకు	విశాఖ– తూర్పుగోదావరి	వైఎస్ఆర్ఆర్
7 నుంచి 8 వరకు	చిత్తూరు –పశ్చిమగోదావరి	కేఎస్ఆర్ఎం
7 నుంచి 8 వరకు	కడప – ప్రకాశం	కేఓఆర్ఎం
10 నుంచి 11 వరకు	చిత్తూరు –ప్రకాశం	వైఎస్ఆర్ఆర్
10 నుంచి 11 వరకు	కడప–తూర్పుగోదావరి	కేఎస్ఆర్ఎం
10 నుంచి 11 వరకు	విశాఖపట్నం – కర్నూలు	కేఓఆర్ఎం
13 నుంచి 14 వరకు	ప్రకాశం – పశ్చిమగోదావరి	వైఎస్ఆర్ఆర్
13 నుంచి 14 వరకు	కడప – కర్నూలు	కేఎస్ఆర్ఎం
13 నుంచి 14 వరకు	చిత్తూరు–తూర్పుగోదావరి	కేఓఆర్ఎం
16 నుంచి 17 వరకు	విశాఖపట్నం –కడప	వైఎస్ఆర్ఆర్
16 నుంచి 17 వరకు	ప్రకాశం–కర్నూలు	కేఎస్ఆర్ఎం
16 నుంచి 17 వరకు	తూర్పుగోదావరి– పశ్చిమగోదావరి	కేఓఆర్ఎం
19 నుంచి 20 వరకు	కర్నూలు –పశ్చిమగోదావరి	వైఎస్ఆర్ఆర్
19 నుంచి 20 వరకు	చిత్తూరు– విశాఖపట్నం	కేఎస్ఆర్ఎం
19 నుంచి 20 వరకు	తూర్పుగోదావరి – ప్రకాశం	కేఓఆర్ఎం
22 నుంచి 23 వరకు	కడప – చిత్తూరు	వైఎస్ఆర్ఆర్
22 నుంచి 23 వరకు	తూర్పుగోదావరి – కర్నూలు	కేఎస్ఆర్ఎం
22 నుంచి 23 వరకు	పశ్చిమగోదావరి – విశాఖపట్నం	కేఓఆర్ఎం

పాత దువ్వూరు గ్రామ కంఠంలో అక్రమ కట్టడాలు

- రాత్రికి రాత్రే వెలుస్తున్న వైనం
- రెవెన్యూ అధికారుల ఉదాసీన వైఖరి



పాత దువ్వూరులో గ్రామ కంఠం భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : దువ్వూరు మండలంలోని పాత దువ్వూరు గ్రామ కంఠంలో గత కొన్ని రోజులుగా అక్రమ కట్టడాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. సర్వే నంబరు 371లో 33 ఎకరాల గ్రామ కంఠం భూములు ఉన్నాయి. ప్రభుత్వ అవసరాల కోసం గ్రామ కంఠంలోని డీకేటీ భూములను ప్రభుత్వం ఎప్పుడైనా వాడుకోవచ్చని చట్టం చెబుతోంది. ఇప్పటికే ఈ భూముల్లో గ్రామ సచివాలయం, స్త్రీ శక్తి భవనం, మండల వ్యవసాయ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం ఇంకా పలు రకాలైన కార్యాలయాలు ఉన్నాయి. కోట్లాది రూపాయల విలువైన గ్రామ కంఠం భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామ కంఠంలో భూములు కొన్ని కడప–కర్నూలు జాతీయ రహదారికి ఆనుకొని ఉండటంతో భారీగా ధరలు పలుకుతున్నాయి. అయితే డీకేటీ భూములలో కొందరు రాత్రి రాత్రే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో ఈ నిర్మాణాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే కొంత మందికి ఈ సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్ జరిగి చేతులు కూడా మారినట్లు తెలుస్తోంది. గ్రామ కంఠం భూములు ఎలా రిజిస్ట్రేషన్ అవుతున్నాయో.. వారికి ఎన్‌ఓసీ పత్రాలు ఎవరు మంజూరు చేస్తున్నారో రెవెన్యూ అధికారులే సమాధానం చెప్పాలి. ఈ భూములు, స్థలాలు రిజిస్టర్ చేసి ప్లాట్‌లుగా వేసి కొందరు విక్రయాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే భూములను కన్వర్షన్ కాకుండానే ప్లాట్‌లుగా వేసి రిజిస్టర్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారుల ఉదాసీనతతోనే గ్రామ కంఠం భూములకు రక్షణ లేకుండాపోతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు తక్షణమే 12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలని, పీఆర్సీ అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో చెన్నూరు, ఖాజీపేట, కమలాపురం, వల్లూరు మండలాలకు సంబంధించిన మహాసభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు 11వ పీఆర్సీ బకాయిలు, కరువు భత్యం బకాయిలు, ప్రావిడెంట్ ఫండ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగుమాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు సుజాత రాణి, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎజాస్ అహ్మద్, చెన్నయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్ వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ. 1.8 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు రికవరీ

- 555 ఫోన్లు బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు
- ఫోన్ల రికవరీలో రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలిచిన జిల్లా పోలీసులు



రికవరీ చేసిన సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేస్తున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్ : 'ఆపరేషన్ మొబైల్ షీల్డ్' కింద కడప జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నెట్ వర్క్ నిఘా, డేటా విశ్లేషణ పద్ధతులు ఉపయోగించి భారీ మొబైల్ ఫోన్ రికవరీ ఆపరేషన్‌లో సఫలమయ్యారు. సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా, మొత్తం 555 మొబైల్ ఫోన్‌లు రికవరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.1.8 కోట్లు ఉంటుంది. ఇప్పటివరకు జిల్లాలో ఐదు విడతల్లో మొత్తం రూ.7.4 కోట్లు విలువైన 4068 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి రాష్ట్రంలోనే తొలిస్థానంలో నిలిచారు. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ బృందం ఉపయోగించిన ఎంఎంటీఎస్ (వాట్సాప్ చాట్‌బాట్ నెం. 9392941541), సీఈఐఆర్ మరింత వేగవంతమైన ఫిర్యాదు పరిష్కారంతో మంచి ఫలితాలను చూపిస్తోంది. గురువారం కడపలోని ×పెన్నార్¤ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ×మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు ఎంఎంటీఎస్ (మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్) ద్వారా లేదా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం వలన ఐఎంఈఐ ఆధారిత ట్రాకింగ్, జియో లోకేషన్, డేటా అనలిటిక్స్ పద్ధతుల ద్వారా ఫోన్‌లు త్వరితగతిన రివకవరీ అవుతాయన్నారు. ఇప్పటి వరకు ఐదు విడతల్లో రూ.7.4 కోట్ల విలువైన 4068 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేశామని తెలిపారు.

- సైబర్ మోసాల నుంచి రక్షణ కోసం, అపరిచిత వీడియో కాల్స్ లేదా ఫిషింగ్ కాల్స్ లేదా ఈ మెయిల్స్‌కు ప్రతిస్పందించకూడదన్నారు.
- సైబర్ నేరగాళ్ల మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలన్నారు.
- ఎంఎంటీఎస్ లేదా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం ద్వారా ఫోన్‌లను ఐఎంఈఐ బ్లాకింగ్, డేటా ప్రొటెక్షన్ సెక్యూరిటీ ఫీచర్లు వినియోగించి, సురక్షితంగా రికవరీ చేస్తామన్నారు.
- మొబైల్ మిస్సింగ్ లేదా దొంగతనం జరిగినప్పుడు బ్యాంక్ ఖాతాలను తక్షణమే బ్లాక్ చేయించాలన్నారు. సిమ్ కార్డు నంబర్‌ను ఆలస్యం చేయకుండా డిసేబుల్ చేయించుకోవాలన్నారు.
- గూగుల్ పే, ఫోన్‌పే వంటి ఆర్థిక యాప్‌లకు 2–ఫ్యాక్టర్ అథెంటికేషన్ లేదా బయోమెట్రిక్ సెక్యూరిటీ వినియోగించాలన్నారు.
- ఎంఎంటీఎస్ లేదా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.
- సెకండ్ హ్యాండ్ ఫోన్‌లను కొనేటప్పుడు ఫోన్ బిల్లు, సెల్‌ఫోన్ బాక్స్ సరిగా పరిశీలించాలన్నారు. అపరిచితుల నుంచి ఫోన్‌లు కొనుగోలు చేయడం ద్వారా సైబర్ లాజిస్టికల్ నేరాలకు గురయ్యే ప్రమాదముందన్నారు.

ఎవరిదైనా మొబైల్ ఫోన్ పోయినా లేదా దొంగతనం జరిగినా వెంటనే వాట్సాప్ నంబర్ 93929 41541, మొబైల్ రికవరీ సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సైబర్ క్రైమ్ మోసాలకు గురైతే వెంటనే డయల్ 1930కు గానీ, ఎన్‌సీఆర్‌పి (హెచ్‌టిటిపిఎస్://సైబర్‌క్రైమ్‌డాట్ జీవీ డాట్ ఇన్) వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ కె. ప్రకాష్‌బాబు, కడప ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్. రమాకాంత్, కడప సైబర్ క్రైమ్ సీఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొబైల్ రికవరీకి సంబంధించిన డిజిటల్ ఫోరెన్సిక్ ఆధారిత నిఘా పద్ధతులు ఉపయోగించామని తెలిపారు. ఈ రికవరీ ఆపరేషన్‌లో పనిచేసిన సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

13 మంది ఈఓపీఆర్‌డీల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న 13 మంది ఈఓపీఆర్‌డీలను బదిలీ చేస్తూ గురువారం పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. స్వచ్ఛతా హి సేవ, విజన్–2047 ముగిసిన నేపథ్యంలో వీరిని బదిలీ చేశారు.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్నది	బదిలీ అయినది
కె.శివారెడ్డి	చక్రాయపేట	జమ్మలమడుగు
టి.వెంకటసుబ్బారెడ్డి	ఖాజీపేట	సీకే దిన్నె
కేఆర్ఎం ప్రసాద్	వల్లూరు	ఒంటిమిట్ట
కె.హరికృష్ణ యాదవ్	బి.కోడూరు	దువ్వూరు
జాన్ కెనడీ	బి.మఠం	బి.కోడూరు
వి.శ్రీధర్	సీకే దిన్నె	వల్లూరు
ఎం.శారదమ్మ	కమలాపురం	పులివెందుల
పి.రామాంజనేయరెడ్డి	కొండాపురం	ప్రొద్దుటూరు
పి.మెహతాబ్ యాస్మిన్	పోరుమామిళ్ల	సిద్దవటం
పి.శశిధర్‌రెడ్డి	ప్రొద్దుటూరు	కొండాపురం
ఆర్.రమణారెడ్డి	మైదుకూరు	పోరుమామిళ్ల
బి.పులిరాంసింగ్	సిద్దవటం	వీఎస్ పల్లె
సి.కుమార రంగయ్య	ఒంటిమిట్ట	బి.మఠం

ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదు

కడప అర్బన్ : కడపలోని ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో సెప్టెంబర్ 30న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యయాదవ్ కుమార్ పర్యటించి పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఆ సమయంలో శిలాఫలకం, ఆహ్వాన పత్రికలలో జిల్లాలోని ప్రజా ప్రతినిధుల పేర్లను ప్రస్తావించ లేదని ఎమ్మెల్సీ తప్పుపట్టడంపై ×సాక్షి¤లో ×ప్రొటోకాల్ పాటించని అధికార గణం¤ శీర్షికన ఈనెల 2నకథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమకు ఎవరినీ కించపరచాలనే ఉద్దేశం లేదని, ఇకమీదట ఇలాంటి పొరపాట్లు దొర్లకుండా చూస్తామని పేర్కొన్నారు.

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ

సిద్దవటం : సిద్దవటంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను గురువారం ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ ప్రకారం ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో అన్నీ నూతన మద్యం దుకాణాలు ఏర్పాటు కావాలని ఆదేశించామన్నారు. అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై ఉక్కు పాదం మోపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, స్థానిక సీఐ రాజశేఖర్, ఎక్సైజ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామానికి వెళ్తుండగా..

– రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రామసుబ్బారెడ్డి మృతదేహం

వింజమూరు(ఉదయగిరి) : మండలంలోని బొమ్మరాజుచెరువు గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి గ్రామానికి చెందిన కె.రామసుబ్బారెడ్డి 33, శ్రీకాంత్‌రెడ్డిలు కారులో కడప నుంచి కావలికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో బొమ్మరాజుచెరువు గ్రామ సమీపానికి రాగా కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించబోయి కారు అదుపుతప్పి పక్కనే ఉన్న కంకర గుట్టపైకి దూసుకెళ్లి తిరగబడింది. ఈ ఘటనలో ఎయిర్ బ్యాగ్ తెరుచుకున్నా ముందు అద్దం పగిలిపోవడంతో రామసుబ్బారెడ్డి నేలపై పడి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కారు నడుపుతున్న శ్రీకాంత్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని అతడిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్ఐ వీరప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.